క్లుప్తంగా

'విచారణ కోసం మాత్రమే పిలిపించాం'

కల్లూరు: కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామానికి చెందిన రైతు నాగన్న, ఆయన భార్య వెంకటేశ్వరమ్మ పోలీసులపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని కర్నూలు రూరల్ తాలూకా సీఐ చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. నాగన్న కుటుంబ సభ్యులు పోలీసు ఉన్నతాధికారులకు పెట్టుకున్న అర్జీ (పిటిషన్)ని విచారించేందుకు మాత్రమే స్టేషన్‌కు పిలిపించినట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వారి పొలం పంచాయితీలో పోలీసులు ఎలాంటి జోక్యం చేసుకోలేదన్నారు. గతంలో పొలం తగాదా విషయంలో ఎప్పుడు కూడా నాగన్న కుటుంబ సభ్యులను ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌కి గాని, సర్కిల్ కార్యాలయానికి కాని పిలువలేదన్నారు.గ్రామంలో రెండు వర్గాల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉండటం వల్ల వారిని కొద్ది రోజులు గ్రామానికి దూరంగా ఉండమని మాత్రమే చెప్పామన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేయండి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య

గడివేముల: గ్రామాల్లో రైతులకు, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని నంద్యాల జిల్లా డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఉపాధి కూలీకి వంద రోజుల పనిని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ఫారంపాండ్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో కంపోస్ట్ పిట్స్‌కు 70 మంది లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామాల్లోనీ రైతులకు ప్రజలకు ఉపయోగపడే శాశ్వత పనులను గుర్తించాలని అధికారులకు సూచించారు. జాబ్ కార్డు లేని వారు స్థానిక కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, ఏపీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గడివేముల: అర్హులైన మైనార్టీలు సబ్సిడీ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా బుధవారం తెలిపారు. ఈనెల 25వ తేదీ లోపల ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరిసరాల శుభ్రత ప్రజల బాధ్యత

సి.బెళగల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రజలందరిది అని ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రం సి.బెళగల్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ పాండురంగన్న ప్రత్యేక పనులు చేపట్టారు. ప్రధాన కూడళ్లలో చెత్తను తొలగించడంతో పాటు, మురికి కాలువలలో పూడికతీత పనులను చేపట్టారు. అదేవిధంగా గ్రామంలోని మంచినీరు, మురుగు నీటి ఆవాసాల్లో దోమల మందును పిచికారి చేయించారు. గ్రామంలోని ఉపరితల ట్యాంక్‌తో పాటు, గ్రామ శివారులోని మంచినీటి ట్యాంక్‌ను కూలీలతో శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించి క్లోరినేషన్ చేయించారు. పనులను ఈఓఆర్డీ పరిశీలించి, గ్రామస్తులకు పరిశుభ్రతపై సూచనలు ఇచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం



గిరిజన గురుకుల బాలికల పాఠశాల


పాణ్యం: నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మేరీ సలోమి బుధవారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడవ తరగతిలో చెంచులకు 75 సీట్లు , ఎస్సీ -2, ఓసీ -1, బీసీ-1, ఏక్యూ-1 చొప్పున మొత్తం 85 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. కేవలం చెంచు బాలికలకు మాత్రమే 4వ తరగతి 66 సీట్లు, ఐదవ తరగతి 70 సీట్లు, ఆరవలో 65సీట్లు, ఏడులో 58 సీట్లు, ఎనిమిదిలో 60 సీట్లు, తొమ్మిదవ తరగతి 49 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రకాశం, గుంటూరు, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 7989834662ను సంప్రదించాలన్నారు.

ఫుట్‌బాల్ లీగ్‌కు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపులోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన క్లస్టర్ యూనివర్సిటీ విద్యార్థినులు భువనేశ్వరి, అనిత తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిజామాబాద్‌లో నిర్వహించనున్న ఈ పోటీల్లో వీరిరువురు పాల్గొంటున్నట్లు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు బుధవారం వెల్లడించారు.

కంగారూ నేర్పే తల్లి పాఠం

- అమ్మ పొత్తిళ్లే బిడ్డకు ఆరోగ్యం
- ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవు
- తల్లికి సమృద్ధిగా పాలు
- ఇన్‌ఫెక్షన్లకు దూరంగా శిశువు
- నేడు కంగారూ సంరక్షణ అవగాహన దినం



కర్నూలు(హాస్పిటల్): నవమాసాలు మోసిన అనంతరం ప్రసవించిన బిడ్డను చూస్తే ఆ తల్లికి కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. అప్పటివరకు అమ్మ కడుపే ప్రపంచంగా ఎదిగిన శిశువు ఒక్కసారిగా బయటి ప్రపంచంలోకి రాగానే అయోమయంలో ఏడుస్తాడు. ఇలాంటి పరిస్థితుల్లో అమ్మ పొత్తిళ్లు ఆ శిశువుకు కొండంత ధైర్యాన్ని ఇస్తాయి. అంతేకాదు తల్లి స్పర్శతో శారీరక, మానసిక ఆరోగ్యం కూడా కలుగుతుంది. ఇదే సమయంలో తల్లికి బిడ్డకు అవసరమైన పాల ఉత్పత్తి జరుగుతుంది. తల్లిపాలను తాగిన బిడ్డకు రక్షణ కలుగుతుంది. నవజాత శిశువుల సంరక్షణకు గాను ఈ నెల 15వ తేదీన కంగారూ సంరక్షణ అవగాహన దినం నిర్వహిస్తున్నారు.

జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఆదోని ఏరియా ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రి, ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కొత్తగా మరో 12 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటితో పాటు 60కి పైగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రతి సంవత్సరం 38 వేల మందికి పైగా గర్భిణులుగా నమోదు చేసుకుంటున్నారు. బిడ్డ జన్మించగానే వారికి ఏదైనా అనారోగ్యం కలిగినా, బిడ్డ తక్కువ బరువుతో జన్మించినా, ఇతర అనారోగ్య సమస్యలేమైనా ఉన్నా వారిని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఎస్ఎన్‌సీయూ, ఎన్ఐసీయూల్లో ఉంచి చికిత్స అందిస్తున్నా రు. జన్మించిన శిశువులకు అవసరమైన టీకాలను అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచా రు. ఈ మేరకు ప్రతి సంవత్సరం 42 వేల చిన్నారుల కు టీకాలు అందిస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఆయా ఆసుపత్రుల్లో శిశువు సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తల్లులకు వివరిస్తున్నారు. తక్కువ బరువుతో, నెలలు నిండకుండానే జన్మించిన శిశువులందరికీ కంగారూ సంరక్షణ శిక్షణ ఇస్తారు.

కంగారూలా బిడ్డకు రక్షణ

తల్లీబిడ్డల మధ్య శిశువు, సుదీర్ఘ శారీరక స్పర్శ కల్పించడం, తల్లి, తన బిడ్డను గుండెలకు హత్తుకునేలా చూడటం కంగారూ మాతృ సంరక్షణ (కేఎంసీ)లోని కీలకాంశం. అలా అని ఈ విధానంలో కేవలం శిశువుకు శారీరక స్పర్శ ఒక్కటే ఉండదు. కంగారూ పొజిషన్, కంగారూ న్యూట్రిషన్, కంగారూ డిశ్చార్జ్ ఈ మూడూ కలగలిపితేనే కేఎంసీ అవుతుంది.

కంగారూలా చేయాలి

ఈ విధానంలో నవజాత శిశువును ఎలాంటి అచ్ఛాదన లేకుండా తల్లి గుండెలకు హత్తుకుంటుంది. దీనివల్ల తల్లీ బిడ్డలిద్దరి మధ్య గాఢమైన శారీరక స్పర్శ ఏర్పడుతుంది.తల్లీబిడ్డలు ఒకరినొకరు చూసుకునే విధంగా, ఇద్దరూసాధ్యమైనంత వరకు నిలబడేభంగిమలో లేదా కూర్చునే భంగిమలో ఉంటారు. తక్కువ బరువుతో, నెలలు నిండకుండా పుట్టినపిల్లలకు తరచుగా ఈ విధానంలో శారీరక స్పర్శ కలిగిస్తారు. ఇది ఒకరకంగా ప్రేమతో కూడిన ఆలింగనం అని వైద్యులు పేర్కొంటారు.

తల్లిపాలతో శిశువుకు రక్షణ

కంగారూ న్యూట్రిషన్ విధానంలో వీలున్నంత వరకు శిశువుకు తల్లిపాలను మాత్రమే ఇస్తారు. ఇందులో తల్లి నేరుగా బిడ్డకు స్థన్యం ఇవ్వొచ్చు. ఒకవేళ శిశువు పాలు తాగలేకపోతే తల్లిపాలను ఒక కప్పులో లేదా చెంచాలో పట్టి బిడ్డకు పట్టించాలి. సంప్రదాయ పద్ధతి (ఉగ్గ గిన్నె)లో కూడా పాలు పట్టవచ్చు. నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు తగినన్ని పోషకాలను అందించాలి.

కంగారూ డిశ్చార్జ్

కంగారూ మాతృ సంరక్షణలో శిశువులు శారీరక బలాన్ని, తగినంత వెచ్చదనాన్ని త్వరగానే సముపార్జించుకుని తల్లిపాలు తాగడం ప్రారంభిస్తారు. ఆసుపత్రి నుంచి వచ్చేసిన తర్వాత ఇంట్లోనే బిడ్డకు తగిన ఆరోగ్య సంరక్షణ ఇవ్వగలనన్న నమ్మకం తల్లికి కలుగుతుంది. ఈ క్రమంలో బిడ్డ ఎదుగుదలను పరీక్షించేందుకు, టీకాలను వేయించేందుకు క్రమం తప్పకుండా ఆసుపత్రికి వెళుతూ ఉండాలి. శిశువు నాడీ వ్యవస్థ అభివృద్ధి ఎలా ఉందనేది ఎప్పటికప్పుడు వైద్యులచే పరిశీలింపజేయాలి.

శిశువుకు కలిగే ప్రయోజనాలు

- శిశువు శరీర ఉష్ణోగ్రత మరీ తక్కువ గాకుండా ఉంటుంది
- ఎక్కుసార్లు, చాలా సేపు తల్లి పాలు తాగుతారు. దీనివల్ల బిడ్డ ఎదుగుదల బాగుంటుంది.
- మెదడు ఎదుగుదల బాగుంటుంది. నాడీ వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.
- అంటువ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.
- శిశువు జ్ఞానేంద్రియాలు సంతృప్తికరంగా పనిచేస్తాయి.

తల్లికి కలిగే ప్రయోజనాలు

- పసిబిడ్డ ఆలనా, పాలనా చూడటంలో తల్లి చురుగ్గా ఉంటుంది.
- ప్రసవానంతరం కలిగే నిర్వేదం, మనో వైకల్యాలు గణనీయంగా తగ్గుతాయి.
- హార్మోనులు బాగా వృద్ధి చెందడం వల్ల బిడ్డకు స్తన్యం బాగా ఇవ్వగలుగుతుంది.
- శిశు సంరక్షణ చక్కగా చేయగలదు.

కంగారూ మదర్‌కేర్‌పై అవగాహన



కంగారూ మదర్‌కేర్‌పై జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం. తక్కువ బరువుతో జన్మించిన బిడ్డకు, నెలలు నిండకుండా జన్మించిన శిశువుకు ఈ విధానం అవసరం అవుతుంది. అయితే ఇలాంటి శిశువులో ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే మాత్రం వారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్ఎన్‌సీయూల్లో చికిత్స అందించాల్సి ఉంటుంది. –డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్ఓ, కర్నూలు

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



మాట్లాడుతున్న సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్

కర్నూలు(హాస్పిటల్): డ్రగ్స్ దుర్వినియోగం లేని సమాజాన్ని సాధించేందుకు కృషి చేయాలని సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో సర్వోదయ ఐటీఐ కళాశాలలో డ్రగ్స్ దుర్వినియోగంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఏ డ్రగ్ నైనా వాడకూడని విధంగా వాడితే అబ్యూజ్ కిందకే వస్తుందన్నారు. ఇలా చెయ్యడం ద్వారా తాత్కాలికంగా ఆనందం కలుగుతున్నా, లేదా వాస్తవ పరిస్థితుల నుంచి తప్పించుకోవడానికి ఇలా చేస్తున్నా డ్రగ్ అబ్యూజ్ అనే అంటారన్నారు. దీని వల్ల ఆరోగ్యం పాడవుతుందని, కుటుంబ సభ్యులతో అనుబంధాలు తగ్గిపోతాయని, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడతాయని జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని, అసలేమీ నేర్చుకోలేని స్థితికి చేరుకుంటారని, ఆలోచనలు, కంట్రోల్‌లో ఉండవని, చెప్పారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశివారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల బలహీనతలను అవకాశంగా వాడుకుని డ్రగ్స్ వ్యాపారులు వారిని వాహకులుగా మార్చి డ్రగ్స్ ఊబిలోకి లాగుతున్నారని, ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాంబాబు, ప్రిన్సిపాల్ జీవరత్నం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి లేకపోతే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ లక్ష్మన్న

కోడుమూరు రూరల్: ఉపాధి సిబ్బందికి కేటాయించిన పనుల్లో పురోగతి సాధించకపోతే చర్యలు తప్పవని ఏపీడీ లక్ష్మన్న హెచ్చరించారు. బుధవారం కోడుమూరు ఉపాధి కార్యాలయంలో ఆయన ఏపీఓ మోదీన్ బాషా, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, మేటీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. మండలానికి ఉపాధి హామీ పథకం కింద 220 పంట కుంటల నిర్మాణాలను పూర్తి చేయాల్సి వుండగా, ఇప్పటి వరకు కేవలం 25 నిర్మాణాలు పూర్తవ్వగా, 52 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలినవి జూన్ నాటికల్లా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఉపాధి కింద ఈఏడాది 250 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేయాలన్నది లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు 111 ఎకరాలు మాత్రమే గుర్తించారని, మిగిలిన లక్ష్యాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. మండలంలో ఉపాధి పనుల్లోకి వచ్చే కూలీల సంఖ్య 4,200 మంది మాత్రమే ఉందని, 5 వేలకు పెంచాలని, రోజువారి వేతనం రూ.260లు పడుతుందని, రూ.307కు పెంచాలని ఏపీడీ సూచించారు.

పంచాయతీల స్థాయి పెంపునకు చర్యలు

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు

ఓర్వకల్లు: ఇప్పటి వరకు వివిధ గ్రేడ్‌లలో కొనసాగిన గ్రామ పంచాయతీల స్థాయి పెంపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆయా గ్రామంలోని జనాభా, గత 3 ఏళ్ల వరకు వచ్చిన ఆదాయ లావాదేవీల ఆధారంగా పంచాయతీల స్థాయిని గుర్తించనున్నారు. గ్రామాల వారీగా పంచాయతీ సెక్రటరీలు సేకరించిన వివరాలను బట్టి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఇందులో ఇప్పటి వరకు గ్రేడ్-1 పంచాయతీగా కొనసాగిన నన్నూరు పంచాయతీని స్పెషల్ గ్రేడ్ పంచాయతీ స్థాయి కల్పిస్తున్నట్లు తెలిసింది. ఈ తరహా పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీఓ స్థాయి అధికారులు విధులు నిర్వహిస్తారు. ఇకపోతే 3వ గ్రేడ్‌లో వున్న హుసేనాపురం, ఓర్వకల్లు, కాల్వ, ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీలు గ్రేడ్-1 పంచాయతీలుగా, గ్రేడ్-3, గ్రేడ్-4 స్థాయిలో వున్న లొద్దిపల్లె, ఉప్పలపాడు, పూడిచెర్ల, కన్నమడకల, శకునాల, మీదివేముల, సోమయాజులపల్లె గ్రామాలు గ్రేడ్-2 స్థాయిలో చేర్చనున్నారు. గ్రేడ్-4, గ్రేడ్-5లో వున్న పంచాయతీలు కేతవరం, బ్రాహ్మణపల్లె, కొమరోలు, గుట్టపాడు, ఎన్ కొంతలపాడు, పాలకొలను, తిప్పాయపల్లె, బొడ్డువానిపల్లె (భైరాపురం), గుడుంబాయి తండా, చింతలపల్లె గ్రామాలను గ్రేడ్-3 స్థాయికి పెంచేవిధంగా గ్రామస్థాయి అధికారులు గుర్తించినట్లు ఆయన వెల్లడించారు.



సరదాగా సాగుతున్న తొర్రిమల్లప్ప, కమలమ్మ కల్యాణం

సరదా కల్యాణం.. ఊరంతా సంబరం !

గొల్లలదొడ్డి గ్రామంలో శ్రీ మల్లందొడ్డి స్వాముల వారి ఉత్సవాలు బుధవారం సరదాగా సాగాయి. గ్రామంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు తొర్రిమల్లప్ప, కమలమ్మ వారి కల్యాణ వేడుక గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ వేడుకలా గ్రామస్తులు తొర్రిమల్లప్ప, కమలమ్మ దేవతామూర్తులకు బదులుగా గ్రామ పురుషుల మధ్య సాగిన కల్యాణం సరదాగా సాగింది. అనంతరం ఆయా గ్రామాల స్వామి వారి పల్లకీలకు నిర్వాహకులు వీడుకోలు పలకడంతో ఉత్సవాలు ముగిశాయి. – సి.బెళగల్

పండ్ల తోటల సాగుతో లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: పండ్ల తోటల సాగులో లాభాలు పొందవచ్చునని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని లొద్దిపల్లె, మీదివేముల, ఉయ్యాలవాడ గ్రామాలలోని సచివాలయాల్లో రైతులతో సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లోని 5 ఎకరాలలోపు భూమి వుండి, నీటి సదుపాయం వున్న రైతులకు పండ్ల తోటల పెంచుకునేందుకు ఉపాధి హామి నిధులతో మొక్కలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మూడేళ్ల పాటు వాటి నిర్వహణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. జాబుకార్డు కల్గివుండి, ఆసక్తి గల రైతులు సంబంధిత క్షేత్రస్థాయి అధికారుల వద్ద వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దీశ్వరమ్మ, ఆయా గ్రామాల ఎఫ్ఏలు, సాంకేతిక సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలి



చనుగొండ్లలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ భాస్కర్

కోడుమూరు రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని డీపీఓ భాస్కర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గూడూరు మండలంలోని చనుగొండ్లలో డీపీఓ భాస్కర్ బుధవారం గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామంలో డెంగ్యూ కేసు నమోదైన దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా గ్రామస్తులు జ్వరంతో బాధపడుతుంటే వారు సంబంధిత ఆరోగ్య సిబ్బందితో రక్తపరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని సూచించారు. అనంతరం డీపీఓ గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి చెత్త నుంచి సంపదను సృష్టించాలని ఈఓఆర్డీ మధులత, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌కు సూచించారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి



కౌలు కార్డులతో కలిగే లాభాలను వివరిస్తున్న ఏఓ హేమ సుందర్ రెడ్డి

గడివేముల: గ్రామాల్లో పొలం లేని వ్యక్తులు కౌలుకు భూములు తీసుకుని వ్యవసాయం చేసే రైతులు కౌలు కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ హేమ సుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వండుట్ల, గని, మంచాలకట్ట గ్రామాల్లో కౌలు కార్డులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 1,027 కార్డులు నమోదు చేసుకోవడానికి అనుమతినిచ్చిందన్నారు. కౌలు కార్డు ద్వారా ప్రభుత్వం అందించే మద్దతు ధరతో పాటు పంటల బీమా సబ్సిడీ విత్తనాలు తదితర లాభాలు ఉంటాయన్నారు. దీంతో పాటు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించడం జరుగుతుందన్నారు. అర్హత ఉన్న రైతులందరూ ఆయా గ్రామాల్లోని వీఆర్వోల వద్ద దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ

కోడుమూరు రూరల్: అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగంగా ఈనెల 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణ కోరారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కేంద్రం ప్రవేశ పెడుతున్న చట్టాల వల్ల దేశంలో రైతులు, కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డు పడుతున్నారన్నారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కడుపుకొట్టే చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు రాముడు, వీరన్న, గఫూర్‌మియ్యా, బి.రాజు, మాధవస్వామి, కె.రాజు, నాగరాజు, లక్ష్మన్న,కుమార్, చిన్న పాల్గొన్నారు.

వ్యాక్సిన్లపై అవగాహన కల్పించాలి

కల్లూరు: ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వ్యాక్సిన్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ అధికారి డాక్టర్ రఘు అన్నారు. బుధవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పెద్దటేకూరు సచివాలయంలో చేపట్టిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు, గర్భిణులకు సచివాలయాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి బుధవారం, శనివారం వ్యాక్సిన్లు వేయాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల వారికి వయస్సుకు తగ్గట్టుగా వ్యాధినిరోధక టీకాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణబాయి, క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు మద్దమ్మ, సచివాలయ కార్యకర్త సువర్ణ, ఆశా కార్యకర్త, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం 'నీరు'గారుతోంది!



సచివాలయం ఎదుట ఖాళీగా దర్శనమిస్తున్న నీటితొట్టి

ఓర్వకల్లు: వేసవి కాలంలో ఆరుబయట సంచరించే పశువుల నిమిత్తం అవసరమైన ప్రదేశాలలో నీటి తొట్లను నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టి లక్ష్యాన్ని నీరు గార్చుతోంది. ఓర్వకల్లు సచివాలయం వద్ద ఓ తొట్టిని నిర్మించారు. అందుకు జాతీయ ఉపాధి పథకం నుంచి ఓ తొట్టికి రూ.33 వేలు ఖర్చుచేశారు. ఉద్దేశం మంచిదే.. కానీ.. నిర్వహణా బాధ్యతలు గాలికొదిలేయడంతో, తొట్ల నిర్మాణం కేవలం ప్రచార ఆర్భాటాల కోసమేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయం వద్ద వున్న బోరుకు అమర్చిన విద్యుత్ మోటర్ పనిచేయక సుమారు పది రోజులైనప్పటికీ, అదిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో పశువులకు తాగడానికి నీళ్లు అందుబాటులో లేవు. మూగజీవాలు దాహంతో తల్లడిపోతున్నాయి. మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలావుంటే, శివారు ప్రాంతాల్లో ఏవిధంగా వుంటుందోనని ఇట్టే అర్థమవుతుంది. ఇప్పటికైన బాధ్యతగల అధికారులు స్పందించి, పశువుల దాహార్తిని తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

16న నెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 16వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బి.క్యాంపు సిల్వర్ జూబ్లీ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె.నాగరత్నమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2009 జనవరి తరువాత జన్మించిన క్రీడాకారులందరూ ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని ప్రకటించారు. సబ్ జూనియర్ బాల బాలికల విభాగంలో నిర్వహిస్తున్న ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈ నెల 18వ తేదీన కర్నూలులోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు 93938 55460 సెల్ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

రోడ్డంతా ఇంతే!

నగరం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని నంద్యాల రోడ్డు నుంచి దిన్నెదేవరపాడును కలిపే వంద అడుగుల రోడ్డు రెండు వైపులా పూర్తిగా దెబ్బతినింది. ఈ రోడ్డుపై పార్థసారథినగర్, ఎఫ్‌సీఐ కాలనీ1, కాలనీ-2, శాంతనగర్, మహాలక్ష్మినగర్ తదితర కాలనీలకు చెందిన ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. అలాగే నాలుగు చక్రాల వాహనాలు రోడ్డుపై ఎదురుగా వస్తే ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– కల్లూరు



రోడ్డు సైడ్లకు దెబ్బతిన్న వంద అడుగుల రోడ్డు

మోసం చేసిన వారికి పాలించే అర్హత లేదు



స్మార్ట్ మీటర్లు వద్దంటూ ముద్రించిన స్టిక్కర్లను చూపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిన కూటమి ప్రభుత్వానికి వారికి పాలన సాగించే అర్హత లేదని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, ఈ.రామాంజనేయులు విమర్శించారు. బుధవారం 32వ వార్డు గంగవతి నగర్, గోవర్ధన నగర్‌లో సీపీఎం నాయకులు ఇంటింటికీ తిరిగి స్మార్టు మీటర్లు వద్దు.. పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు స్మార్ట్ మీటర్లను బి గించబోమని,కరెంట్ చార్జీలను పెంచబోమని చెప్పి మోసం చేశారన్నారు. మోసం చేసే వారికి పాలన చేసే అర్హత ఉండదన్నారు. నాయకులు సురేష్, దావీదు, బీసన్న, శ్రావణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, జే.రాజా తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు విస్తృత కార్యక్రమాలు

కర్నూలు(హాస్పిటల్): హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం కళాజాత బృందాల ద్వారా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, క్షయ విభాగాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ చెప్పారు. ఆయన బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జెండా ఊపి కళాజాత బృందాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన హెచ్ఐవీ ప్రభావిత ప్రాంతాల్లో 20 చోట్ల ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కళాజాత బృందాలకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న సిబ్బంది, ఎన్జీఓలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్ వంటి శాఖలతో సమన్వయం చేసుకుని కళాజాత కార్యక్రమాలకు ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలన్నారు. డెమో శ్రీనివాసులు శెట్టి, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటరత్నం, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు సుధారాణి, నాగరాజు, లింక్ వర్కర్ స్కీమ్ డీఆర్‌పీ నాగరాజు, మునీర్, విజయ, మలేరియా విభాగం అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.